(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

# *1964*

## జనవరి

2. మధ్యాహ్నం 2. 45కి నార్ల ఇంటికి. ఆయనను చూడటానికి హైదరాబాద్ నుండి విమానంలో బివిన్ రెడ్డిగారు వచ్చారు. సంతోషం ,సంభ్రమం .. ఆయన సినిమా పూజాఫలం విడుదలైంది. ప్రేక్షకుల ప్రతిస్పందన చూడటానికి వచ్చాడు. కార్యదర్శి కళ్యాణి రిహార్సల్స్ చూసుకొనటానికి ఆఫీసుకు వెళ్లాను.

4. యువపాశం కథకు యువ నుండి 30/రూ వచ్చాయి. నవోదయ నుండి రెండు పుస్తకాలు తెచ్చాను.

5. ఉదయం 11 గంటలకు నీలం రాజు శేషయ్య గారి దగ్గరకు వెళ్ళాను. పూజాఫలం సమీక్షించామన్నారు. వద్దు ఆయన గొప్ప మేధావి అని పి ఎన్ ఆర్ అన్నాడు. ఆలోచన వదిలేసాను.

7. నాట్యకళకు వ్యాసం రాయలేక పోయాను. గోపీచంద్ సన్మాన సంచిక అందింది.

13. సాయంత్రం 7. 30 కి గొర్రెపాటి వెంకట సుబ్బయ్య గారి ఇంటికి. కాళోజి తో, ఎజెఆర్ తదితరులతో కబుర్లు. అరటి పండ్లు, టీ తీసుకున్నాం. సాహిత్య అకాడెమీ సభ్యుల దగ్గర కాళోజి తన కవిత్వం చదివాడు. సుబ్బులుతో కలిసి నవోదయకు. 'ఫ్రెంచ్ విప్లవం' తెచ్చాను.

19. ఇప్పనపాడులో .. డిటెక్టివ్ నవల చదివాను. మధ్యాహ్నం ఎ.ఐ. ఆర్ కాంపౌండ్ చెట్ల స్కెచ్ కి వాటర్ కలర్స్ వేస్తూ..

20. ఎ.ఐ. ఆర్ కాంపౌండ్ చెట్ల స్కెచ్ వాటర్ కలర్స్ చక్కగా వస్తున్నది. పుస్తకాలు చదువుతూ ..

21. Dr భాస్కర రావు ఏదూరి కి తాపేశ్వరం వెళ్ళాను. లక్షాధికారి చూసాను.

22. పాప కొడుకుతో పొలాలకు. ఒక వాటర్ కలర్ స్కెచ్ వేసాను. బందిపోటు సినిమా చూడటానికి ప్రసాద్ తో కలిసి మండపేటకు . పుష్పవల్లి తల్లి పాత్ర వేసింది. తండ్రి పాత్ర నాగయ్య వేసాడు.

23. తాపేశ్వరం లో ఏదూరి చివరి రోజు. ఉదయం 10 నుండి 12-30 వరకు కాలువ దగ్గర పొలాలలో .. చాల అందమైన దృశ్యం. కానీ చాల వేడిగా ,అసౌకర్యం గా ఉంది. పొలాల వాటర్ కలర్ చిత్రం వేసాను. ఇప్పనపాడుకు. ఇంటిముందున్న గుడిసెల వాటర్ కలర్ చిత్రం వేసాను. ఫరవాలేదు. మధ్యలో వదిలేసాను. ఎం. శివకామయ్య గారినుండి సాంస్కృతిక వారోత్సవాలలో ఒక రోజు మాట్లాడమని ఆహ్వానం. ఇంకొకటి బళ్లారి రాఘవ మీద వ్యాసం కోరుతూ అనంతపురం నుండి. అంగీకరించలేదు.

24. --- ఖోస్లా పుస్తకం చదువుతూ---

25. ఉదయం తాపేశ్వరం చెరువుదగ్గర పొలాలకు .. ఒక స్కెచ్ కూడా వేసాను. సాయంత్రం ఇప్పనపాడు బంగ్లా దగ్గర పొలాలలో స్కెచ్ ---

28. ఆక్స్ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ --- షేక్స్ పియర్ విమర్శ కొన్నాను.

## ఫిబ్రవరి

2. 6 గంటలకు ..అందరం మూగమనసులు సినిమాకు వెళ్ళాం. ఎ.ఎన్.ఆర్ ,సావిత్రి, జమున .. వినోదాత్మకంగా ఉంది.

9. విధులలో చేరాను.

11. యాంగర్ అండ్ ఆఫ్టర్ చదివాను. ప్లేబోయ్ జోకర్ ..

12. 'గొలుసు' రికార్డింగ్ విన్నాను. సేవకుడు దానయ్య (ఎన్ . సుబ్బారావు ) బాగా చేసాడు.

13. మద్రాస్ బుక్ సెంటర్ నుండి 5 పుస్తకాలు వచ్చాయి. 52 రూపాయల 40 పైసలు. 1,2. మెన్ హూ రూల్స్ ఇండియా ,3. వర్జీనియా ఉల్ఫ్ 4. డయాబిటీస్ 5. పిక్ అఫ్ పంచ్

14. వర్జీనియా ఉల్ఫ్ చదివాను .

15. తాపేశ్వరం చెరువు దగ్గర ల్యాండ్ స్కేప్ ఆయిల్ చిత్రం వేస్తూ .. సాయంత్రానికి ముందు చెడి పోయింది.

16. పాత చిత్రాలు ,కవర్ డిజైన్స్ –అన్నీ ఒక పద్ధతిలో అమరుస్తూ 12.30 వరకు గడిపాను.

20. 'మళ్ళీ వచ్చిన మధుర క్షణం' కథ  రాయటం ప్రారంభించాను. 4 పేజీలు అయింది.

22. పుస్తక ప్రపంచం పత్రికకు కథ పోస్ట్ చేసాను. నన్ను ప్రభావితం చేసిన పుస్తకం వ్యాసం నెల్లూరు కి పంపాను.

23. ఐ బిలివ్ పుస్తకం చదువుతూ ..

## మార్చ్

1. తాపేశ్వరం పొలాల ఆయిల్ స్కెచ్ వేసాను . అంత సంతృప్తి కరం గా లేదు.

5. 'వాట్ ఈస్ హిస్టరీ' కొన్నాను.

10. సాయంత్రం సుబ్బులుతో కలిసి 'ది లయన్'. సింహం తో స్నేహం చేసిన ఒక అమ్మాయిని తీసుకొని వెళ్లాలని ఇద్దరు మగవాళ్ళు చేసిన ప్రయత్నం .. దక్షిణ ఆఫ్రికా నేపధ్యం .. అందమైన రంగుల ఛాయా చిత్రీకరణ.

15. ఉగాది. నూనె పెట్టుకొని తల స్నానం. వాటర్ కాలర్ స్కెచ్ లు వేస్తూ.. నవల కోసం ఒక వర్ణన–ప్రకృతిలో ఒంటరి తనం  –బౌండ్ బుక్ లో  ఒక పేజీ రాసాను. పేపర్లు చదివాను.

16. వి.యు.ఎస్  గొలుసు నాటకాన్ని ప్రసారం చేసింది. ఫరవాలేదు.

18. నవలలో కనబడని పాత్రల పై వ్యాసం 5 పేజీలు రాసాను. శర్వాని కథ, కృష్ణ కృపాలిని రాసిన టాగోర్ జీవిత చరిత్ర చదివాను.

19. నవలపై వ్యాసం మరి రెండు పేజీలు రాసాను. పుస్తక ప్రపంచం లో నాదీ ,సుబ్బులుది కథలు ప్రచురించ బడ్డాయి. లత సుబ్బులు కథకు మొదటి స్థానం ఇచ్చింది. పద్మరాజు కథకు రెండవ స్థానం ,నా కథకు మూడవ స్థానం ఇచ్చింది.

20. వీరాజు కథ మరొకటి చదివాను. వ్యాసం మరొక 5 పేజీలు రాసాను.

21. ... టాగోర్ జీవిత చరిత్ర చదివాను. షేక్ స్పియర్ శైలి పై వ్యాసానికి నోట్స్ తీసుకొన్నాను.

23. షేక్ స్పియర్ శైలి పై వ్యాసానికి నోట్స్ తీసుకొన్నాను.  టాగోర్ జీవిత చరిత్ర పూర్తి చేసాను.

24.  షేక్ స్పియర్ శైలి పై వ్యాసానికి నోట్స్..

29. ముళ్ళ పూడి సంచికకు నవలలో కనబడని పాత్రలు వ్యాసం 8 పేజీలు రాసి 11గంటలకు పడుకున్నాను.

30. నవల పై వ్యాసం రెండు పేజీలు ... శీలా వీరాజు కథ ఒకటి చదివాను.

31. వై.ఎస్.ఎన్ ఈ సంవత్సరపు నాటక సాహిత్యాన్ని సమీక్షిస్తూ రాసిన వ్యాసం ప్రచురించ బడిన జ్యోతి (29 మార్చ్ ) ని తెచ్చి ఇచ్చింది లత. ప్రభుత్వ కార్యక్రమాల  ప్రచార క్షీణత కు ఉదాహరణ గా గొలుసు నాటకాన్ని కొట్టి పారేసాడు. ఒకేనిద్ర .. కృత్రిమంగా ఉందన్నాడు. గొల్లపూడి ,రాచకొండ ,శ్రీశ్రీ నాటకాలు నమ్మకాన్ని ఇస్తున్నాయని  అన్నాడు.

## ఏప్రిల్

1. నవల పై వ్యాసానికి తుది మెరుగులు దిద్దుతూ .. వీరాజు కథల పుస్తకం ముందుమాటకు నోట్స్ రాసుకొంటూ .. జమీన్ రైతు నుండి 'నన్ను ప్రభావితం చేసిన పుస్తకం' వ్యాసం రి ప్రింట్స్ వచ్చాయి.
2. నవల పై వ్యాసం తణుకు పంపాను.

9. ఢిల్లీ లో రిఫ్రెషింగ్ కోర్సు గురించి లేఖ వచ్చింది. సాహిత్య కార్యక్రమాల గురించి పేపర్ చదవాలి నేను.

10.నార్ల నాటకాల పుస్తకానికి ముందుమాట పంపాడు. సుబ్బులు అతి కష్టం మీద చదివింది.

11. ఉదయం 9 కి నార్ల దగ్గరకు. ముందుమాట చదివి వినిపించాడు. కాస్త అసంతృప్తి గా వుంది. కోటేశ్వరరావు రావు కు ఇచ్చాను. 'కలవారి కోడలు' చూసాను.

15. శీలా వీర్రాజు నుండి అతని కథల పుస్తకానికి పరిచయం కోరుతూ ఉత్తరం.

18. అమరశిల్పి జక్కన రంగుల చిత్రం చూసాను. నిరాశ మిగిల్చిన సినిమా. మూర్తి ఇంట్లో దేవులపల్లి కృష్ణ శాస్త్రి కి కాన్సర్ ఆపరేషన్ జరిగిన వార్త తెలిసింది.

20. విశ్వనాథంతో కలిసి లీలా మహల్ లో హిచ్ కాక్ సినిమా.

21. సాహిత్య కార్యక్రమాల పై ప్రసంగ ప్రతి ఢిల్లీ కి పంపాను.

22. కోటేశ్వర రావు రాత్రి 7 గంటలకు వచ్చి 300 రూపాయలు ఇచ్చి కథల సంపుటాల లెక్క పూర్తి చేసాడు. సుబ్బులు కథలు తీసుకు వెళ్ళాడు.

26. గంట ఆలస్యంగా 11.30 కి ఢిల్లీ చేరాను. పి.బి.జి అతని భార్య ,ప్రసాద్ స్టేషన్ కు వచ్చారు. 8 మైళ్ళ దూరంలో రామకృష్ణాపురం లో ఉన్న అతని ఇంటికి వెళ్లాం.

27. 10 గంటలకు పి.బి.జి కారులో ఆకాశవాణి భవనానికి . రిఫ్రెషర్ కోర్స్ 4వ అంతస్తు లో ..

# మే

2. సాహిత్య కార్యక్రమాల పై ప్రసంగ పత్రం చదివాను. 19 నిముషాలు పట్టింది. మధ్యలో రెండు సార్లు మంచి నీళ్లు తీసుకోవలసి వచ్చింది.

3. 9.30 కి సుబ్బులుతో బయటకు. గాంధీ సమాధి ,జైన్ గుడి ,గురుద్వార్ ,ఎర్రకోట చూసాం. 11.30 వరకు.

12. 7.30 కి హరిద్వార్ లో .. మద్రాస్ సత్రం లో పై అంతస్తు లో గది. 3/రూ .గంగానది చక్కగా కనబడుతుంది. నదిలో దీపాలను వదిలే పెద్ద జన సమూహం. మేమూ రెండు దీపాలు పంపాము.

13. 8.30 కి టాక్సీ లో రిషీకేశ్ కు బయలు దేరాం. 11.50 కి చేరాం. ఆంధ్రాశ్రమం లో బస. టాంగా లో లక్ష్మణ్ ఝులా కు. దారి సరిగా లేదు. మూడు మైళ్ళ నడక. నది దిగువ భాగాన బిర్లా మందిర్. గొప్ప భవనం. 1. 30 కి ఇంటికి. స్వామి మాకు మంచి ఆహారం ,విశ్రాంతికి ఫ్యాన్లు ఉన్న మంచి గది ఇచ్చాడు.సంజీవరెడ్డి ,రాధాకృష్ణన్ ఉన్న గది అది. బస్సులో డెహరాడూన్ కి బయలుదేరాం. 5గంటలకు చేరాం. అక్కడినుండి ముస్సోరి చేరేసరికి 9 గంటలు. ప్లాజా హోటల్ లో మకాం.

14. ముస్సోరిలో విపరీతమైన చలి రాత్రి. మధ్యాహ్నం 3.30 కి డెహరాడూన్ కి తిరుగు ప్రయాణం. 5.30 కి చేరాం. మూడవ తరగతి టిక్కెట్లు లేవు. రెండవ తరగతి టికెట్లు తీసుకొని పఠాన్ కోటకు ప్రయాణం.సహరాంపూర్ లో రాత్రి 12.15 కు దిగాం.వెయిటింగ్ రూంలో గంట ఉండి 1.30 కి ఎక్స్ ప్రెస్ ఎక్కాం. జమ్ముకు 7.30 కి చేరాం.

15. ఉదయం 8.15 కు ఏ క్లాస్ బస్సులో జమ్మూ నుండి ప్రయాణం. తిరుగు ప్రయాణం టిక్కెట్లు 22/-రాంనగర్ .. మార్గంలో మహోన్నతమైన పర్వతాలు ,జలపాతాలు, పొలాలు.. లేత పసుపు రంగు వెలుగులో నాలుగు మైళ్ళపొడవు టన్నల్ ప్రయాణం .. శ్రీనగర్ చేరేసరికి సాయంత్రం 7.30.

18. ఆహారపు కారియర్ తో బస్సులో పహల్గామ్ కు. తోవలో చాల స్థలాలు, ఒక గుడి చూసాం.3 గంటల సమయంలో రెండు స్కెచ్ లు వేసాను. ఒక పర్వత జలపాతం దగ్గర భోజనం .. పర్వతాల దృశ్యం పెన్సిల్ స్కెచ్ వేసి సాయంత్రం 4.30 కి తిరిగి వచ్చాం. శ్రీనగర్ కు 7. 30 కి చేరాం. బోట్ హౌస్ లో తిని పడుకున్నాం. బోట్ నడిపే మనిషి ది అతని భార్య ది స్కెచ్ లు గీసాను.

19.ఉదయం 8.30 కి గుల్ మార్గ్ కు బస్సులో టెరెన్ మార్గ్ 26 మైళ్ళు చేరేసరికి 11. అక్కడి నుండి గుర్రాలను27 రూపాయలకు ,మార్గదర్శి ని 4/రూ కి కుదుర్చుకున్నాం.12.30 కి గుల్ మార్గ్ చేరాం. అక్కడ టీ తీసుకున్నాం. .. ఖిల్న్ మార్గ్ కు ఒంటిగంటకు బయలు దేరాం. మధ్యలో కాసేపు విశ్రాంతి. నంగా పర్వతాలు చూసాం. స్లెడ్జ్ ల మీద మంచులో పైకి వెళ్ళాం. గుర్రాల మీద 2 గంటలకు తిరిగి వచ్చాం. టీ తాగి గుల్ మార్గ్ లో3 గంటలకు స్కెచ్ లు. 4 గంటలకు బయలు దేరి 5.30 కి టెరెన్ మార్గ్ చేరాం. 6. 30 బస్సులో శ్రీనగర్ కు.

21. ఉదయం 7 గంటలకు శ్రీనగర్ వదిలి జమ్మూ చేరేసరికి రాత్రి 8. 30. తోవలో రెండు స్కెచ్ లు వేసాను.

22. 6. 30 కి పఠాన్ కోట కు ప్రయాణం. 9.30 కి చేరాం .రెండవ తరగతి స్త్రీల విశ్రాంతి గదిలో సుబ్బులును ఉంచి ఉదయపు ఫలహారం తెచ్చాను. రైల్వే స్టేషన్ స్కెచ్ గీసాను. 10–15 ఎక్స్ ప్రెస్ లో శ్రీనగర్ నుండి తిరుగు ప్రయాణం.

23. కొత్త ఢిల్లీ స్టేషన్ కు 8. 30కి చేరాం.

24. అరగంట ఆలస్యంగా మధ్యాహ్నం 1.40 కి విజయవాడ చేరుకున్నాం.

27. రెండుగంటలకు జవహర్ లాల్ నెహ్రూ చనిపోయాడన్నవార్త తీసుకొని వచ్చాడు రామ్. హటాత్తుగా వచ్చిన గుండెపోటు కారణం అని రేడియో లో విన్నాం. దిగ్భ్రాంతి కలిగింది. స్నానం చేసి ఆయన ఆత్మ శాంతికి ప్రార్థించాను.

30. ఫ్రాంక్ మొరెస్ రాసిన నెహ్రూ జీవిత చరిత్ర , దిస్ ఈస్ ది జంగల్ ..చదువుతూ గడిపాను .

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments